క్లుప్తంగా

నీల్వాయి ఎస్సై హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఏట మధుకర్ ఘటన వ్యవహారంలో నీల్వాయి ఎస్సై పి.కోటేశ్వరరావును హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటన విడుదల చేశారు. మధుకర్ ఘటనలో ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపైనా కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసును విచారణ చేపట్టాల్సిందిగా చెన్నూర్ రూరల్ సీఐని ఆదేశించినట్లు తెలిపారు.

ఆస్పత్రి తనిఖీ

జైపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ శనివారం, బుధవారం పిల్లలకు వ్యాకినేషన్ చేపట్టాలని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, పరీక్షలు చేయాలని తెలిపారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్


దుండె రాజేశ్వరి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరంలోని ఆదిత్య ఎంక్లేవ్‌లో నివాసం ఉంటూ, చెన్నూర్ జెడ్పీ పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దుండె రాజేశ్వరి తెలుగులో డాక్టరేట్ పట్టాను పొందారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠం వరంగల్ కేంద్రంలో ఆచార్య భట్టు రమేశ్ పర్యవేక్షణలో 'తెలంగాణ ప్రాంత పెరిక కుల సంస్కృతి సంప్రదాయాలు అధ్యయనం' అనే అంశంపై తెలుగులో రాసి, తెలుగు విశ్వవిద్యాలయానికి పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని రచించినందుకు డాక్టరేట్ అందుకున్నారు.

మ్యాట్రిమోనీ సైట్లలో మోసాలు

బెల్లంపల్లి: సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ సైట్లలో మోసాలు జరుగుతున్నాయని వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై సి.హెచ్.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వివాహ వాగ్దానం చేస్తూ నమ్మకం పొందిన తర్వాత నకిలీ ఆన్‌లైన్ పెట్టుబడి పథకాల్లో డబ్బులు పెట్టమని బాధితులను ప్రలోభ పెడుతున్నారని తెలిపారు. ఇటీవల రాష్ట్రానికి చెందిన ఓ బాధితుడు రూ.7.7కోట్లు నష్టపోయాడని పేర్కొన్నారు. నిర్ధారించని, ఆకర్షణీయమైన ప్రొఫైళ్లకు దూరంగా ఉండాలని తెలిపారు. మ్యాట్రిమోనీ సైట్‌లో వ్యక్తిగత గుర్తింపు, కుటుంబ నేపథ్యం మొదలైన వివరాలను స్వతంత్రంగా ధృవీకరించుకోవాలని, భావోద్వేగాల పేరుతో వివాహ వాగ్దానాలపై ఆధారపడి ఎప్పటికీ పెట్టుబడులు పెట్టొద్దని సూచించారు. ఏమైనా అనుమానాలు కలిగితే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విగ్రహం వద్ద బీసీ రిజర్వేషన్‌పై కోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి చిత్తశుద్ధి ఉంటే గవర్నర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుకలు


విద్యార్థుల విన్యాసాలు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల ఐబీటీ చుక్కా రామయ్య హై స్కూల్‌లో శనివారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్వెస్టిట్యూర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీడర్ ట్రైనర్ స్కౌట్స్ షరీఫ్, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం విద్యార్థులతో క్రమ శిక్షణ, సేవా భావం, నాయకత్వ గుణాలు పెంపొందించేందుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఏఎల్‌టీ రవీంద్రచారి మాట్లాడుతూ.. స్కౌటింగ్ ద్వారా సమాజానికి సేవ చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇది కేవలం శారీరక శిక్షణ కాదు, మానసికంగా బలం కలిగించే ఉద్యమం అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల విన్యాసాలు, సంస్కృతిక ప్రదర్శనలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో చైర్మన్ కొమ్ము దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మధుకర్‌ది రాజకీయ హత్యే

- మాజీ ఎంపీ వెంకటేశ్ నేత
- మృతికి కారకులైన వారిని శిక్షించాలని ఆందోళనలు
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- రోడ్లపై రాస్తారోకో, ధర్నా నిర్వహించిన బీజేపీ నాయకులు


తాండూర్ ఐబీలో రాస్తారోకో చేస్తున్న నేతలను ఆందోళన విరమింపజేస్తున్న పోలీసులు

చెన్నూర్: వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షులు ఏట మధుకర్‌ది రాజకీయ హత్యేనని పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత అన్నారు. వేమనపల్లి మండల కాంగ్రెస్ నాయకుల వేధింపులతో మధుకర్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని ఆయన ఆరోపించారు. మృతదేహానికి చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్‌తో కలిసి సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కోటపల్లి సీఐ బన్సీలాల్‌ను కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధుకర్ కేసును పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి'

బెల్లంపల్లిరూరల్/కోటపల్లి/దండేపల్లి/మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/భీమారం: భారతీయ జనతా పార్టీ వేమనపల్లి మండల అధ్యక్షుడు ఏట మధుకర్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో, బెల్లంపల్లి మండలం పోచమ్మ గడ్డ ప్రాంతంలో, కోటపల్లి మండలకేంద్రంలో, కాసిపేట మండలం దేవాపూర్‌లో మధుకర్ ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ దిష్టి


జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

బొమ్మను శనివారం దహనం చేశారు. దండేపల్లిలో అంబేడ్కర్ స్టాచ్ వద్ద నిరసన చేపట్టారు. మందమర్రిలో బీజేపీ మండల అధ్యక్షుడు గిర్నాటి జనార్దన్ ఆధ్వర్యంలో, భీమారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా నాయకులు మాడెం శ్రీనివాస్, మండల బీజేపీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ నిరసన తెలిపారు. అనంతరం మధుకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు గాజుల ముఖేశ్ గౌడ్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, పల్లి రాకేశ్, ఆకుల అశోక్ వర్దన్, నస్పూర్ జోన్ అధ్యక్షుడు గొర్రె చక్రవర్తి, శ్రీరాంపూర్ జోన్ అధ్యక్షుడు సత్రం రమేశ్, హాజీపూర్ మండల అధ్యక్షులు స్వామిరెడ్డి, బెల్లంపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు గజెల్లి రాజ్‌కుమార్, కోటపల్లిలో మండల బీజేపీ ఉపాధ్యక్షుడు పెద్దింటి పున్నంచంద్, కాసిపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్ కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాస్తారోకో, ధర్నా

తాండూర్/నెన్నెల: తాండూర్ మండల కేంద్రంలో రాస్తారోకో, నెన్నెల మండల కేంద్రంలోని టీ రోడ్డు వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. గంట పాటు రోడ్డుకు అడ్డంగా బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుకర్ ఎదుగుదలను చూసి ఓర్వలేక అతడిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటమే కాకుండా, అతడిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. దీనిని అవమానంగా భావించిన మధుకర్ ఆత్మహత్యకు పాల్పడటం పార్టీకి తీరని లోటన్నారు. దీనికి కారకులైన ఎస్సైతో పాటు కాంగ్రెస్ నాయకులను కఠిన శిక్షలు పడే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తాండూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా కార్యదర్శి రామగొని మహీధర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయులు, నెన్నెలలో మండల బీజేపీ అధ్యక్షుడు అంగలి శేఖర్, బీజేపీ నాయకులు శైలేందర్‌సింగ్, శ్రీనివాస్‌గౌడ్, అద్దెనపల్లి సతీష్, లింగంపల్లి మహేష్ పాల్గొన్నారు.


చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కోటపల్లి సీఐతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత


నెన్నెలలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు


కోటపల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు


మధుకర్ పాడె మోస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు, గోమాస శ్రీనివాస్

వేమనపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ అంత్యక్రియలు పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగాయి. చెన్నూర్ సివిల్ ఆసుపత్రి వద్ద శనివారం ఉదయం పోస్టుమార్టం పూర్తి కాగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐలు బన్సీలాల్, దేవేందర్ రావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని నీల్వాయికి తరలించారు. ఇంటి వద్ద అభిమానులు, పార్టీ కార్యకర్తల సందర్శనార్థం ఉంచగా, సుమారు 100మంది పోలీసులు పహారా కాశారు. పోలీస్ పహారా మధ్య మృతదేహాన్ని ఇంటి నుంచి ప్రధాన రహదారి గుండా నీల్వాయి అటవీ సమీప ప్రాంతానికి తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళ్లిపోయే వరకు నీల్వాయి, కొత్తగూడెం కాలనీలో ఉత్కంఠ వాతావరణం మధ్య మధుకర్ అంతిమ యాత్ర కొనసాగింది.

పాడె మోసిన ఎమ్మెల్యే హరీష్ బాబు

వేమనపల్లి: మధుకర్ కుటుంబాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు పరామర్శించారు. ఏట మధుకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని ఎమ్మెల్యే హరీష్ బాబు, గోమాస శ్రీనివాస్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ పాడే మోశారు. ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజీ, దుర్గం అశోక్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జయరామ్ రావు, వట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ల కల్పనకు ఉద్యమిస్తాం


ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

చెన్నూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా చట్ట సభల్లో సైతం బీసీ రిజర్వేషన్ల కల్పనకు ఉద్యమిస్తామని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్, జ్యోతిభాపూలే విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అగ్రవర్ణ కులస్తులు కుట్రపన్ని హైకోర్టులో పిటిషన్ వేసి స్టే తీసుకొచ్చారని ఆరోపించారు. 5శాతం లేని అగ్రవర్ణాలకు 10శాతం ఈడబ్ల్యూ రిజర్వేషన్లు ఏ జనాభా ప్రతిపాదిక అమలైందని ప్రశ్నించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థలతో పాటు చట్టసభల్లో అమలు చేసే వరకు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు సిద్ది రమేశ్‌యాదవ్, సాధనబోయిన కృష్ణ, చింతల శ్రీనివాస్, కొండపర్తి వెంకటరాజం, తుమ్మ రమేశ్, జడల మల్లేశ్, అయిలాల రమేశ్, దొమకొండ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులపై పనిభారం మోపొద్దు'


సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికులపై పనిభారం మోపొద్దని ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు తెలిపారు. ఎస్ఆర్పీ 1గనిపై శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గనిలో కార్మికులను అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పనికి సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కార్మికుల సాధన కోసం ఐఎన్‌టీయూసీ పోరాడుతుందన్నారు. ప్రభుత్వ సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. మహిళా ఉద్యోగులు రక్షణ కోసం కూడా పనిచేస్తున్నామన్నారు. సభ్యత్వం చెల్లించడానికి కార్మికులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని తెలిపారు. గుర్తింపు సంఘం నాయకులు కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. దీంతో కార్మికుల్లో ఐఎన్‌టీయూసీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, తిరుపతి రాజు, మారేపల్లి బాబు, ఏరియా నాయకులు రావుల అనిల్, ఎం వెంకటేష్, తిరుపతి, నాయకులు యుగంధర్, సిరాజ్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ కుట్రతోనే బిల్లు పెండింగ్'

చెన్నూర్: బీజేపీ కుట్రతోనే బీసీ రిజర్వేషన్ల బిల్లు పెండింగ్ పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రంలో 8 మంది ఎంపీలు ఉన్నా బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు అన్ని సంఘాలు మద్దతు తెలిపి, కేంద్రం పై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం చెన్నూర్ మండల కార్యదర్శి చందు, ఉమారాణి, చంద్రన్న, సరిత, నాగజ్యోతిలు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న స్వామి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా ఈ నెల 26న శివాలయంలో నిర్వహించనున్న సామూహిక వివాహాల నిర్వహణకు టీపీసీసీ ఎన్నికల ప్రచారక మిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆర్థిక సాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో రూ.21వేలు తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులకు అందజేశారు. పేద యువతీ యువకుల పెళ్లి కోసం తనవంతు ఆర్థికసాయం అందించిన స్వామిని నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు రత్నం రాజం, రంగ రామన్న, గెల్లి జయరాం, గరిగే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన శాఖ ద్వారా రాయితీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు లాభసాటి రాయితీలు కల్పిస్తున్నట్లు మంచిర్యాల ఉద్యానవన శాఖ ఏఈవో శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరానికి 57ఆయిల్‌పామ్ మొక్కలు అందజేయనుండగా రూ.1,140చెల్లిస్తే 90శాతం రాయితీతో మొక్కలు అందజేస్తూ మొక్కలు నాటిన రైతుకు నాలుగేళ్ల వరకు ఎకరానికి రూ.4,200ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక ఆయిల్‌పామ్ సాగులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ రైతులకు 90శాతం, ఓసీలకు ఐదు ఎకరాల లోపు ఉంటే 90శాతం రాయితీపై మొక్కలు, విత్తనాలు అందించనున్నట్లు తెలిపారు. పండ్లు, కూరగాయల సాగుకు కూడా రాయితీ అందుబాటులో ఉందని, ఆయిల్‌పామ్ సాగు రైతులు సరిహద్దులో నాటుకునేందుకు వెదురు మొక్కలు కూడా రాయితీలో ఇస్తున్నామని పూర్తి వివరాలకు 99517 77993లో సంప్రదించాలని తెలిపారు.

సీఎండీని కలిసిన ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు శనివారం సింగరేణి సీఎండీ బలరాంను హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కలిశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం డైరెక్టర్(పా) గౌతం పొట్రును కూడా కలిశారు. కారుణ్య ఉద్యోగ నియమకాలను వెంటనే చేపట్టాలన్నారు. పోస్టింగ్‌లు ఇవ్వకుండా జాప్యం చేయడం వల్ల వారి సర్వీసు నష్టం జరుగుతుందన్నారు. ట్రాన్స్‌ఫర్ల పాలసీని ఎత్తివేసి, పాత పద్ధతినే కొనసాగించాలన్నారు. మెడికల్ బోర్డు ఏర్పాటుపై సానుకూలంగా ఉండాలన్నారు. మారుపేర్ల సమస్య ఇంకా ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మాయమవుతున్న గుట్టలు..!

- దర్జాగా మొరం దందా!
- పట్టించుకోని అధికారులు


గుట్టవద్ద మొరం కోసం వచ్చిన ట్రాక్టర్లు

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి సమీపంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా గుట్టను తవ్వి, మొరం తీసి అక్రమంగా తరలించాలిస్సిన చోటికి తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులు సాగిస్తున్న మొరం దందాతో చూస్తుండగానే గుట్టలు మాయమవుతున్నాయి.

రాత్రి, పగలు తేడా లేకుండా..

రాత్రివేళ అధికారులు చర్యలు చేపట్టరనే ఉద్దేశంతో గతంలో రాత్రివేళ తవ్వకాలు జరిపిన అక్రమార్కులు, ఇప్పుడు రాత్రిపగలు తేడా లేకుండా ఎలాంటి అనుమతులు లేకున్నా జేసీబీలతో తవ్వకాలు చేపట్టి, ట్రాక్టర్లలో నింపి తరలించాల్సిన చోటికి తరలిస్తూ రెండు చేతులా అక్రమంగా ఆర్జిస్తున్నారు. పక్కా ప్రణాళికతో తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులకు చిక్కకుండా ఉండేందుకు తవ్వకాలు చేపట్టే ప్రదేశాలకు సమీపంగా అక్కడక్కడ కొంత మంది ఇన్‌ఫార్మర్లను పెట్టుకొని గుట్టుగా తవ్వకాలు సాగిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్‌కు రూ.వెయ్యి, టిప్పర్ మొరానికి దూరాన్ని బట్టి రూ.3నుంచి 4వేల వరకు విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు.

పర్యవేక్షణ లేక..

రెబ్బనపల్లి శివారులో గుట్ట ప్రాంతాల్లో పలుచోట్ల మొరం తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో మొరం తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రెబ్బనపల్లి శివారులో గల ప్రభుత్వ స్థలాల్లో ఉన్న మొరం తవ్వకాలకు అడ్డుకట్ట వేసి సహజ సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

అనుమతులు లేవు..

రెబ్బనపల్లి శివారులో మొరం తవ్వకాలకు ఎవరికి ఎలాంటి అనుమతులు లేవు. తవ్వకాలు జరిగినట్టు మా దృష్టికి వచ్చింది. దీంతో మా సిబ్బందిని అలర్ట్ చేశాం. అక్రమంగా మొరం తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటాం.

– రోహిత్‌దేశ్‌పాండే, తహసీల్దార్, దండేపల్లి

బండి సంజయ్‌కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే

జైపూర్: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు ఏటా మధుకర్ కుటుంబాన్ని పరామర్శించడానికి శనివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి జైపూర్ మండలం ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జైపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు ఆయనకు ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద స్వాగతం పలుకగా చెన్నూర్ మీదుగా ఆయన నీల్వాయి చేరుకున్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల సత్తా


ప్రిన్సిపాల్‌తో కలిసి విద్యార్థుల విజయసంకేతం

బెల్లంపల్లి: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో 14మంది విద్యార్థులు హాజరై 12పతకాలు సాధించారు. వీరిలో 8మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై రికార్డు సృష్టించారు. గురుకుల విద్యాలయంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల్లో కె.సంకేత్ (షాట్‌పుట్-స్వర్ణం, డిస్కస్ త్రో-రజతం), పి.లక్ష్మణ్ (100మీటర్లు-కాంస్యం), జి.సాహెబ్రో (100మీటర్లు-కాంస్యం), టి.చరణ్(లాంగ్‌జంప్, హైజంప్-రజతం), టి.సిద్ధార్థ(లాంగ్‌జంప్, హైజంప్-స్వర్ణం), బి.రాకేష్(110 మీటర్ల హార్డిల్స్-స్వర్ణం, ట్రిపుల్ జంప్-స్వర్ణం), యు.చరణ్ (400మీటర్ల హార్డిల్స్-రజతం), ఎస్.వికాస్ యాదవ్ (హైజంప్-రజతం) ఉన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



భీమారం: మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపుకు వద్ద శనివారం లారీలో 900యూరియా బస్తాలు వచ్చాయి. విషయం తెలుసుకుని రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి షాపు ఎదుట బారులు తీరారు. అవసరం ఉన్నవారికి ఇచ్చేందుకు షాపు యజమాని అన్ని ఏర్పాట్లు చేశారు. లైన్‌లో నిలబెట్టి బస్తాలు అందజేశారు. ఒక వైపు ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నప్పటికి రైతులు మాత్రం యూరియా కోసం ఎగబడుతున్నారు. ఈ విషయమై 'సాక్షి' పలువురు రైతులను ప్రశ్నించగా ఇప్పటివరకు తమకు సరిపోను యూరియా ఇవ్వలేదని, ఒక్క బస్తా ఇవ్వడం వల్ల పంటలకు సక్రమంగా వేయలేకపోయామని తెలిపారు. ఏవో సుధాకర్ మాట్లాడుతూ.. మండలానికి సమృద్ధిగా యూరియా వచ్చిందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

'ఆదివాసీలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదు'


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట: ఆదివాసీల ఉద్యమానికి భయపడి ఆదివాసీల నాయకులను లంబాడీలు లక్ష్యంగా చేసుకుంటున్నారని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడ జంగు విమర్శించారు. శనివారం దేవాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ అరుణ్‌కుమార్‌కు 20ఏళ్ల ఆదివాసీ ఉద్యమ చరిత్ర ఉందన్నారు. డీజీపీకి ఫిర్యాదు చేసినంత మాత్రన ఆదివాసీ ఉద్యమం ఆగదన్నారు. తుడుందెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షుడు హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్, తుడుందెబ్బ జిల్లా ప్రధానకార్యదర్శి కనకరాజు, ఉపాధ్యక్షుడు కనక గోవర్ధన్, ఆత్రం మహేష్, తదితరులున్నారు.

• సమస్యలపై మంత్రికి వినతి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలపై లెదర్‌పార్కు సాధన చర్మకార వృత్తిదారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ రాష్ట్ర గనులు, కార్మిక ఉపాధికల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. శనివారం సీఈఆర్ క్లబ్ సమీపంలోని మంత్రి క్యాంపు ఆఫీస్ వద్ద మంత్రిని కలిసి సమస్యలు విన్నవించారు.

• కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసం వద్ద శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేశారు.

14న కబడ్డీ పోటీలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 14న గుడిపేట్ రెవిలేషన్ స్కూల్లో అండర్-17బాలబాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్‌జిల్లా కార్యదర్శి యాకుబ్ తెలిపారు.